నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 14 ఆగస్టు 2024 | HYDERABAD

నల్ల చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

నల్ల చెరువు కబ్జాలను తొలగిస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ)/మన్సూరాబాద్ : ఉప్పల్ నల్లచెరువులో కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. చెరువు పర్యవేక్షణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని తెలిపారు. ఉప్పల్ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం నల్లచెరువును పరిశీలించారు. చెరువులు, నాలాలను, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కబ్జాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. చెరువును పరిశీలించిన వారిలో తహసీల్దార్ వాణిరెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఈఈ నాగేందర్, ఇరిగేషన్ ఏఈ పృథ్వీ ఉన్నారు. అలాగే మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని హత్తిగూడ చెరువు ఎఫ్‌టీఎల్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు.

దివ్యాంగులకు ట్రై సైకిల్స్‌ను అందజేస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

దివ్యాంగుల హామీలను నెరవేర్చాలి

ట్రై సైకిళ్ల పంపిణీలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట : దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ట్రై సైకిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేసిందని చెప్పారు. పింఛన్లతో పాటు దివ్యాంగులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేసుకోవడానికి నిధులు కేటాయించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం పనిచేయాలన్నారు. అధికారంలోకి రాక ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలిచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు కామేశ్ రెడ్డి, తుక్కుగూడ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, కార్పొరేటర్ భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దీప్‌లాల్ చౌహాన్, లలితాజగన్, నిర్మలారెడ్డి, అంజయ్య ఉన్నారు.

హైడ్రాకు 259 పోస్టులు

పోలీస్ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై భర్తీ

ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ

డీఆర్ఎఫ్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మరిన్ని పోస్టులు

హైడ్రాను బలోపేతం చేస్తున్న కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణగా ఏర్పాటైన హైడ్రా యాక్షన్‌లో దూకుడు పెంచింది. ఇప్పటికే గడిచిన నెల రోజులుగా కబ్జా రాయుళ్లపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా మూడు దశల్లో కార్యాచరణ రూపొందించుకుని ఇందుకు చర్యలు చేపడుతున్నది. ఇప్పటికే చందానగర్ ఈర్ల చెరువు, నందగిరిహిల్స్, బహదూర్‌పుర, లోటస్‌పాండ్, గాజులరామారం తదితర ప్రాంతాల్లో ఆక్రమణలపై హైడ్రా కూల్చివేతలు జరిపింది. ఈ మేరకు హైడ్రాకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో పాటు సిబ్బంది నియామకంతో బలోపేతం చేయాలని కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. దీంతో పోలీస్‌శాఖ నుంచి వివిధ పోస్టులకుగాను 259 మందిని డిప్యుటేషన్‌పై కేటాయిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఫైర్ డిపార్ట్‌మెంట్ 188 మంది, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీతో కలిసి దాదాపు 2,680 మందిని నియమించుకోనున్నారు. జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా పేర్కొంటూ ప్రభుత్వం ఆ ప్రాంతం వరకు విపత్తు నిర్వహణ తదితర అధికారాలతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పేరుతో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. పార్కులు, లే అవుట్‌లు, ఖాళీ ప్రదేశాలు, ఆట స్థలాలు, చెరువులు, నాలాలు, భూ భాగాలు, రోడ్లు, క్యారేజ్‌వేలు, ఫుట్‌పాత్‌లు తదితరమైన వాటిని కబ్జాల నుంచి పరిరక్షించడం హైడ్రా విధులుగా పేర్కొంటూ గత నెల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే ప్రజలను విపత్తుల నుంచి రక్షించేందుకు, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, చెరువుల కబ్జాలను నియంత్రించడం, నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకునేందుకు హైడ్రా చీఫ్ ఏవీ రంగనాథ్ గడిచిన కొన్ని రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువులు, పార్కుల అక్రమార్కులపై చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు హైడ్రాను మరింత బలోపేతం చేస్తున్నారు.

డిప్యుటేషన్‌పై భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు

ఆఫీసర్ ర్యాంక్	కేడర్	మొత్తం పోస్టులు
ఎస్పీ	ఐపీఎస్	1
ఎస్పీ	నాన్‌కేడర్	3
ఏసీపీలు (డీఎస్పీ)	-	5
ఇన్‌స్పెక్టర్	-	21
ఎస్.ఐ.	-	33
ఆర్ఐ	-	5
ఆర్ఎస్ఐ	-	12
పోలీస్ కానిస్టేబుల్స్	-	101
హోంగార్డులు	-	72
ఏవోలు	-	3
అసిస్టెంట్ ఏవోలు	-	3

జీవో 58, 59 పై

అయోమయం

దరఖాస్తుల పరిశీలన పూర్తయినా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం

మేడ్చల్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ భూముల్లో నిర్మించుకున్న ఇండ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి జీవో 58, 59 దరఖాస్తులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ జీవో కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన పూర్తయినా క్రమబద్ధీకరణ విషయం పై ప్రభుత్వం నిర్ణయం ప్రకటించకపోవడంతో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో జీవో 58 కింద 26,092 దరఖాస్తులు రాగా, జీవో 59కింద 15,200 కలిపి మొత్తం 41,292 దరఖాస్తులు వచ్చాయి. అయితే అప్పట్లో ఐదు నియోజకవర్గాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల ఆధారంగా నేరుగా ఇంటి అడ్రస్ ఆధారంగా వెళ్లి పరిశీలన చేశారు. పరిశీలన జరిపి ఇంటి ఫొటోతో పాటు ఆధారాలను అప్‌లోడ్ చేశారు. పరిశీలన పూర్తికావడంతో దరఖాస్తుదారులు తమ ఇంటికి సంబంధించి క్రమబద్ధీకరణ అవుతాయని ఆశగా ఎదురు చూశారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

దరఖాస్తులపై నిర్ణయం ఎప్పుడు?

జీవో 58,59 పై ప్రభుత్వ ఆదేశాల కోసం రెవెన్యూ అధికారులు వేచి చూస్తున్నారు. కాగా త్వరలోనే అక్రమ లే అవుట్ల నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు త్వరలో దరఖాస్తులను స్వీకరించనున్నారు. దీంతో పాటు జీవో 58, 59 దరఖాస్తులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఆహార భద్రతకు ఇక్రిసాట్ సహకారం

సిటీబ్యూరో, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ) : ఆహార భద్రత, పోషకాహారం అందించడమే లక్ష్యంగా ఇక్రిసాట్ చేస్తున్న పరిశోధనలతో పుష్కళమైన విత్తన సంపత్తి పెరుగుతుంది. వ్యవసాయ రంగానికి ఆధునీకరిస్తూనే, శాస్త్రీయ విధానంలో దిగుబడిని పెంచేలా పరిశోధనలు చేస్తుండగా కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్రిసాట్ అభివృద్ధి చేసిన 109 వంగడాలను ఇటీవల ప్రధాని మోదీ విడుదల చేయగా... వీటిని ఆఫ్రికా లాంటి దేశాలకు సరఫరా చేస్తోంది. అధిక దిగుబడి, తక్కువ సాగు నిర్వహణతో తక్కువ పంట కాలం ఉండే 61 రకాల పంటల వంగడాలను అభివృద్ధి చేసింది. ఇక్రిసాట్ డెవలప్ చేసిన పంటలతో రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పరిశోధకులు తెలిపారు. ప్రత్యేక జన్యు బ్యాంకును అందుబాటులోకి తీసుకువచ్చామని, ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సదస్సులో ఇక్రిసాట్ డెవలప్ చేసిన వంగడాలను ప్రదర్శించినట్లు వివరించారు. జొన్న హైబ్రిడ్ ఎస్‌పీహెచ్ 1943, కందుల రకం నామ్-88, పెర్ల్‌మిల్లెట్ హైబ్రిడ్ పూసా 1801 వంటి వంగడాలను ఇక్రిసాట్, ఇతర అగ్రి పరిశోధన సంస్థలతో కలిసి రూపొందించామని, రానున్న రోజుల్లో అధిక దిగుబడితోపాటు, వాతావరణ మార్పులను తట్టుకునే, బయోఫోర్టిఫైడ్ పంటలను అభివృద్ధి చేయనున్నట్లు ఇక్రిసాట్ వర్గాలు పేర్కొన్నాయి.

తగ్గేదెలే!

హైడ్రా రంగంలోకి దిగింది. నగరంలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నది. పలు చోట్ల ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కు స్థలాలను ఆక్రమించినట్లు గుర్తించి.. అక్రమనిర్మాణాలను కూల్చివేస్తున్నది. ఇందులో భాగంగా నందగిరి హిల్స్ హుడా లే అవుట్‌లో పార్కుకు కేటాయించిన ఖాళీ స్థలాన్ని పరిరక్షించేందుకు అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రహరీ నిర్మించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ విషయంలో బస్తీవాసుల తరపున స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడంతో వివాదం తలెత్తింది. ఎమ్మెల్యే వర్సెస్ హైడ్రా కమిషనర్‌గా మారింది. చివరికీ ఈ పంచాయితీ సీఎం రేవంత్ రెడ్డి వద్దకు చేరింది.

దానం వర్సెస్ రంగనాథ్

నందగిరి హిల్స్ హుడా లే అవుట్ ఖాళీ స్థలం విషయంలో వివాదం

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో ఆక్రమణలపై 'హైడ్రా' యాక్షన్‌లోకి దిగింది. రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్ బంజారాహిల్స్‌లోని మిథిలానగర్ కాలనీ, లోటస్‌పాండ్ పార్కు, గాజులరామారం, బుమ్‌రుఖా ఉద్ దవాల్ చెరువుల్లో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సమయంలో ఐదు రోజుల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నం. 52లోని నందగిరిహిల్స్ హుడా లే అవుట్‌లోని ఖాళీ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు, డబ్బాలను రంగనాథ్ దగ్గరుండి కూల్చివేయించారు. వెంటనే కాలనీవాసుల సహకారంతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఇక్కడే స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ రంగనాథ్ వ్యవహారాన్ని తప్పు పట్టారు. కూల్చివేతలు ఓకే..ప్రహరీ గోడ నిర్మాణంపై దానం అభ్యంతరం వ్యక్తం చేశారు. రంగనాథ్ తీరుపై ఎమ్మెల్యే దానం భగ్గుమన్నారు. ఈ నెల 10న సంబంధిత ప్రాంతానికి చేరుకోగా తన అనుచరులు, బస్తీ వాసులు ప్రహరీని కూల్చివేశారు. ఇందుకు ప్రోత్సహించిన ఎమ్మెల్యే దానం పై చర్యలు తీసుకోవాలని హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి వి. పాపయ్య ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో రంగనాథ్‌పై దానం మంగళవారం ప్రెస్‌మీట్ పెట్టి ఘాటుగా స్పందించారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరి చివరకు ఈ పంచాయితీ సీఎం వద్దకు చేరింది. అయితే సీఎం ఎలా స్పందిస్తారు? హైడ్రా అటు జీహెచ్ఎంసీ, ఇటు ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారిందన్న నేపథ్యంలో హైడ్రా తదుపరి ఆపరేషన్ ఎలా ఉంటుందనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది.

వివాదానికి కారణమైన ప్రహరీ కూల్చివేత ఇదే..

అసలు వివాదం ఇక్కడే..

జూబ్లీహిల్స్ రోడ్ నం.52లోని నందగిరిహిల్స్ హుడా లే అవుట్‌కు ఆనుకొని గురుబ్రహ్మనగర్ బస్తీ ఉంది. దాదాపు 400 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద కుటుంబాలు 40 ఏండ్ల నుంచి నివాసం ఉంటున్నారు. ఈ బస్తీ వాసులకు, నందగిరిహిల్స్ లే అవుట్ కాలనీవాసులకు మధ్య రహదారి విషయంలో వివాదం నడుస్తోంది. హైడ్రా కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ రంగనాథ్ ఆక్రమణలపై చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగానే నందగిరి హిల్స్ కాలనీకి, గురుబ్రహ్మనగర్ బస్తీకి మధ్య వివాదంలో ఉన్న సుమారు 850 గజాల ఓపెన్ ల్యాండ్‌ను పరిశీలించారు. వాస్తవానికి ఈ స్థలంలో పార్కు రావాల్సి ఉంది. కానీ, ఈ స్థలం పరిధిలో కొంత మేర గురుబ్రహ్మనగర్ బస్తీ వాసులలో కొందరు టిఫిన్, చాయ్ దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. దీనిపై కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ నెల 9వ తేదీన పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలను కూల్చివేశారు. తక్షణమే కాలనీవాసుల సహకారం తీసుకొని ప్రహరీ గోడ నిర్మించాలని ఆదేశించారు. ఈ సమయంలో స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ నేను లోకల్‌లో లేను ..పార్కు స్థలం కాపాడేందుకు ఒకవేళ గోడ నిర్మాణం చేయాలంటే జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మిస్తామని, జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేస్తానని రంగనాథ్‌కు వివరించారు. అయితే రంగనాథ్ మాత్రం తక్షణమే ప్రహరీ కట్టించి ప్రభుత్వ ఆస్తిని కాపాడే ప్రయత్నం చేశారు. రాత్రి పోలీసుల పహారాలో పేదల గుడిసెలకు ఆనుకుని భారీ ప్రహరీ ఏర్పాటు చేశారు. ఈ ప్రహరీ నిర్మాణంతో సుమారు 50 కుటుంబాలకు చెందిన గిరిజనులు ఇంట్లోంచి బయటకు రాకుండా గోడలు వెలియడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడం, బస్తీ వాసులు సంబంధిత ప్రహరీని కూల్చివేసే ప్రయత్నం చేశారు. 10న ఎమ్మెల్యే దానం నాగేందర్ సంబంధిత ప్రాంతానికి చేరుకోవడం.. అనుచరులు, బస్తీ వాసులు ఆ ప్రహరీని కూల్చారు. ఈ స్థలానికి ఆనుకునే బసవరాజు అనే వ్యక్తి సుమారు 300 గజాల మేర కబ్జా చేసినా వారి జోలికి వెళ్లకుండా బస్తీ వాసులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారంటూ ఆరోపించారు. ఇందుకు ప్రోత్సహించిన దానంపై చర్యలు తీసుకోవాలని హైడ్రా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి వి.పాపయ్య ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు దానం, మరికొందరిపై పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. దీంతో దానం రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాంటోళ్లను ఎందరినో చూశా..

దానం నాగేందర్

నందగిరిహిల్స్ హుడా లే అవుట్ ఘటనపై అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని దానం నాగేందర్ హెచ్చరించారు. గురుబ్రహ్మనగర్‌లో పేదల గుడిసెలు కూల్చివేసే అధికారం రంగనాథ్‌కు ఎవరిచ్చారని, సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను జీపీఏ రాసిచ్చారా? అని దానం నాగేందర్ ప్రశ్నించారు. పేదల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తానని.. వంద కేసులు పెట్టినా భరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని దానం నాగేందర్ స్పష్టం చేశారు.అధికారులు వస్తుంటారు..పోతుంటారు.. తాను లోకల్ అని దానం చెప్పారు. ఉద్యోగం ఇష్టం లేని వాళ్లు, డైలీ పబ్లిసిటీ కావాలనుకునే వాళ్లే ఇలాంటివి చేస్తుంటారన్నారు. ఈనెల 10న నందగిరిహిల్స్ గురు బ్రహ్మనగర్‌లో ఉన్న పార్కుకు నిర్మాణం చేసిన ప్రహరీని కూల్చివేసిన ఘటనలో దానం ప్రమేయం ఉందనే అభియోగంతో జీహెచ్ఎంసీ విజిలెన్స్, డిజాస్టర్ విభాగం అధికారులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ నెల 12న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో మంగళవారం హైదర్‌గూడ, ఆవంతినగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ... హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పదవి నచ్చకనే తనపై కేసు నమోదు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ మోషన్ ఇస్తానన్నారు. నందగిరి హిల్స్ హుడా లే అవుట్ సమీపంలో ఉండే గిరిజనులకు ఇబ్బందులు కలుగుతుందనే విషయం తన దృష్టికి రావడంతో.. తాను అక్కడికి వెళ్లి సమస్యను రంగనాథ్‌కు ఫోన్‌లో తెలియజేశానని తెలిపారు. పార్కు వద్ద కొందరు ప్రైవేట్ వ్యక్తులు గోడ నిర్మించారని స్థానికులు ఆవేశంతో తన ప్రమేయం లేకుండా గోడను కూల్చివేసిన మాట వాస్తమేనని, దీనికి అధికారులు హద్దు మీరి పనిచేయడం సబబు కాదన్నారు. బస్తీవాసులు రాకపోకలు సాగించేందుకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారని, ప్రజాసమస్యలను పరిష్కరించడం తన బాధ్యతని వ్యాఖ్యానించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని దానం నాగేందర్ తెలిపారు.

ఎవరికైనా ఒకే రూల్

రంగనాథ్, హైడ్రా కమిషనర్

ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో ఎవరికైనా ఒకే రూల్ అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. నందగిరిహిల్స్ పార్కు స్థలం విషయంలో వ్యక్తిగతంగా ఎలాంటి ఆసక్తి లేదని, పార్కు స్థలం ఆక్రమణ కాకుండా చూసేందుకే అక్కడికి వెళ్లానని కమిషనర్ స్పష్టం చేశారు. గురుబ్రహ్మనగర్ బస్తీవాసులకు, నందగిరిహిల్స్ కాలనీవాసులకు మధ్య నడుస్తున్న వివాదంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పార్కు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తే బస్తీవాసులకు రోడ్డు లేకపోతే తనకు ఏం సంబంధం అని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు తనపై ఒత్తిడి తెచ్చిన తాను పట్టించుకోనని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో నందగిరి హిల్స్ పార్కు స్థలాన్ని ఆక్రమణలకు గురి కానిచ్చేది లేదని, బస్తీ వాసులకు రోడ్డు ఇచ్చే బాధ్యత తన బాధ్యత కాదన్నారు. నందగిరి హిల్స్ లే అవుట్‌లో 850 గజాల జీహెచ్ఎంసీ ఓపెన్ స్పేస్ ఉందని, ఇది ప్రభుత్వానికి చెందినదని, దీనిని కాపాడే యత్నంలో భాగంగా చుట్టూ ప్రహరీ నిర్మించడం జరిగిందన్నారు.

నగరంలో వీధి కుక్కలు చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. కుక్కల బెడదను నివారించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మంగళ వారం హైటెక్‌సిటీలో సంచరిస్తున్న వీధి కుక్కల సమూహం.

అపార్ట్‌మెంట్లలో డస్ట్‌బిన్లు తప్పనిసరి

టెలీకాన్ఫరెన్స్‌లో కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): అపార్ట్‌మెంట్లలో డోర్ టూ డోర్ తిరగకుండా ఒక చోట డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభతరం అవుతుందని, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వారిని సంప్రదించి బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అపార్ట్‌మెంట్లలో చెత్త సేకరణ వివిధ కారణాలతో పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలో వేయడం లేనందున అక్కడ తడి, పొడి చెత్తను వేయడానికి బిన్‌లను ఏర్పాటు చేసుకున్న పక్షంలో సంబంధిత బిన్‌లలో వేసిన చెత్తను స్వచ్ఛ ఆటో తీసుకొని పోయేందుకు సులభతరం అవుతుందని కమిషనర్ తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్ల వద్ద వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండేలా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులను కమిషనర్ ఆదేశించారు. పశువులు రోడ్లపై తిరగడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున సంచరించకుండా క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): విద్యాసంస్థల లోపల, బయట ర్యాగింగ్ చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి హెచ్చరించారు. తెలంగాణ ర్యాగింగ్ నిషేధ చట్టం- 1997 ప్రకారం ర్యాగింగ్ తీవ్రమైన, శిక్షార్హమైన నేరమని, చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ఎవరైనా ఓ వ్యక్తి ర్యాగింగ్‌కు పాల్పడితే ఆరు నెలల నుంచి పదేండ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంని తెలిపారు. ఆ తరువాత ఏ విద్యా సంస్థలోనూ ప్రవేశాలు పొందడానికి వీలు ఉండదన్నారు. ప్రిన్సిపాల్స్ వార్డెన్లు, తల్లిదండ్రులు, విద్యార్థులతో కూడిన యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సైబరాబాద్‌లో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ర్యాగింగ్ ఘటనలను పోలీసుల దృష్టికి తేవడానికి మీ సమీపంలోని పోలీస్‌స్టేషన్ కాని, డయల్ 100కు కాని కాల్ చేసి సమాచారమివ్వాలని సూచించారు.

తిరంగా యాత్ర

జవహర్‌నగర్, ఆగస్టు 13: స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ.. దేశభక్తిని చాటుతూ సీఆర్‌పీఎఫ్ జవాన్ల తిరంగా యాత్ర ఉత్సాహంగా సాగింది. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ నుంచి మల్లెలగూడ, అరుంధతినగర్ ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ.. జవాన్లు దేశం కోసం ప్రాణాత్యాగానికైనా ముందుంటారని, దేశ భద్రతే వారి లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర్య స్ఫూర్తి ఉప్పొంగాలని, ఎందరో త్యాగధనుల వల్ల నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని తెలిపారు. జవాన్లలో దేశభక్తి నరనరాన ఇమిడి ఉంటుందని, దేశ సేవలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ క్యాంపస్ ప్రాంతమంతా జవాన్ల బైక్ ర్యాలీ, నినాదాలు చేస్తున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

అరుంధతినగర్‌లో నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు